"ఇంటి అధికారం ఇల్లాలు హస్తగతం అయిపోయిందన్న మాట." అతను చెప్పేసకథ విన్నాకొసేపటికి జేబులో ఉన్న టిన్డ్ బీర్ కొంచెం నోట్లో పోసుకుని, ఫారిన్ బ్రాండ్ సిగరెట్టు వెలిగించి తీరిగ్గా అన్నాడు, సలహాల స్వామీజీగా చెలామణీ అవుతున్న సమర్పణరావు.

"అవునురా. నువ్వే ఆదుకోవాలి. ఏదో నువ్వు పాత ఫ్రెండువని, ఉద్యోగం లేక సలహా లిచ్చే సొంత ఉద్యోగం చేస్తున్నావని తెలుసుకుని వచ్చాను" అలివేలు అధికారంలో చిక్కుకున్న సత్య నైలాను వలలో పడిన చేప పిల్లలా గిలగిలకొట్టుకుంటున్నాడు.

"ఇక్కడ నేను స్వామీజీని. సలహాలు అడిగేటప్పుడు నీరాను వాడకూడదు."

"నీరా, సారా, నాటూ, నల్లమందు నేను చస్తే ముట్టను. ఎప్పుడైనా సరదా పుడితే బ్రాందీ, విస్కీ లాంటివే పుచ్చుకుంటానురా."

"అదిగో, అలాంటి సంబోధన వద్దంటున్నాను."

"అంటే?"

"అంటే...నీ—నీకు అని కాని, రా—రా అని కాని, ను—నువ్వు అని కాని అనరాదు.ఇట్స్ ప్రొహిబిటెడ్. అలా పిలిచినా, అగ్రమో చేసినా మనకి మూడ్ కుదరదు. సలహాలు మంచివి దొరకవు."

"అలాగా. చిత్తం. చిత్తగించండి".

కొన్ని క్షణాలు వృధాగా పోనిచ్చి, సమర్పణరావు హావకాశంగా ప్రశ్నించాడు.

"అయితే ఏమిటి నీ గాథ. బాధ?"

సత్య కూర్చున్న చోటునుండి లేచి, తల బాదుకుని గట్టిగా అరిచాడు.

"అయ్యో! చెప్పాను స్వామీజీ!"

"మళ్ళీ చెప్పాలి. ."

"తప్పదంటారా. చెప్పక తప్పదంటారా?"

తప్పదన్నట్లు సమర్పణరావు తల అడ్డంగా తిప్పే వరకీ, కథ చెప్పడం మొద లెట్టాడు, శివకోటి సత్యన్నారాయణ బి. ఎ. ఉరవ్ సత్య.

• • •




సత్య తన జీవితంలో బాగా గుర్తు పెట్టుకున్న రోజులు మూడేమూడు. అసలు ప్రతి మనవాడు ఆ మూడు రోజుల్నీ జీవితాంతం జ్ఞాపకం ఉంచుకోవాలనికూడా అంటాడు. అలాంటి ప్రత్యేకతను సంతరించుకున్న మూడు రోజుల్లో మొదటిది చదువులో పట్టా తీసుకున్న రోజూటు. రెండోది ఉద్యోగంలో చేరిన తొలి రోజులు. మూడోది అందరి సమక్షంలో మూడు ముళ్ళు వేసిన పెళ్ళి రోజూటు.

అలా ప్రత్యేకతను సంతరించుకున్న ఒకానొక పెళ్ళి రోజున డాబా మీద వెన్నెల్లో భార్య ఒడిలో తల పెట్టుకుని, అందమైన అనుభవాల్ని నెమరు వేసుకుంటున్న సమయాన—"అలివేలూ! నీ కోక వరం ఇస్తున్నాను. కోరుకో" అని అభయహస్తం ఇచ్చాడు సత్య.

ఆమె చిరునవ్వు నవ్వింది. ఆభరణాలు అడగలేదు. అడవిరాముడు సినిమాకి తీసుకు వెళ్ళ మన లేదు. చీరలు కోరలేదు. షికార్లు కావాలన లేదు. అదీ ఇదీ అడగలేదు. ఆలోచించింది. ఆలోచించి ఆలోచించి—"ఇంటి అధికారం ఇమ్మండి" అని మాత్రం గోముగా అడిగింది. "ఓహో! ఇంతేనా! ఈ క్షణమే మన ఇంటి అధికారం అప్పగిస్తున్నాను" అని చెప్పి గబగబా కిందికి దిగి వచ్చి, జీతం రాబడి వివరాలు, ఇంటి ఖర్చుల జాబితా, బాంకు చెక్కులు, కరంటు రిసీట్టు, ఇనప్పెట్టి తాళాలు, వగయిరా, వగయిరా మేడమ్ అలివేలుకి మేడోవరు చేశారు, సత్య.

మరునాటినుంచి ఆ ఇంట్లో సరికొత్త ప్రభుత్వం మొదలయ్యింది.

ప్రభుత్వం మారినప్పుడు కొత్త పథకాలురావడం కద్దు.

ఇంట్లో చాలా చాలా మార్పులు వచ్చాయి. అందరూ పెందరాళే లేవాలి. ఎవరి పనులు వాళ్ళు సక్రమంగా నిర్వర్తించాలి. అనవసరమైన దుబారాలు చెయ్యకూడదు. వీలున్నంత వరకు ఆదాయం చేయాలి. కాలాన్ని వృధా చేయకూడదు. ఎవరైనా అక్రమంగా ప్రవర్తించినట్లు తెలిస్తే, వాళ్ళకి శిక్ష తప్పదు. పొదుపు చేసి, ఆ డబ్బుతో ఇంట్లోకి అవసరం అనుకున్న వస్తువులు కొనాలి. చిన్నా పెద్దా చాలా ప్రాజెక్టులు అమల్లో ఉన్నవి. వాటిని సాధించడం కోసం ఇంట్లో చిన్నా పెద్దా శ్రద్ధ చూపించి, కృషి చేయాలి.

మొదట్లో అలివేలు అమలు పరిచిన ప్రతి ప్రతిపాదనను సత్య ఆనందంగా అంగీకరించాడు. ఎక్సలెంటన్నాడు. ఫెంటాస్టిక్ అని పొగిడాడు. అద్భుతం అని శ్లాఘించాడు. విలువైన ఆలోచనలని 'ఒహో' అని చప్పట్లు కొట్టాడు.

విజయనగరం పిడపర్తి వారి కేలండర్లు రెండు చిరిగిపోయాయి.

రెండేళ్ళ అధికారంలో అలివేలుకి కావలసినంత అనుభవం వచ్చేసింది. ఏ సమస్యను ఏ విధంగా ఎదు

ర్కోవాలి. ఏ విషయం గురించి ఎంతవరకు ఆలోచించాలి, ఎవరితో ఎలాంటి పనులు చేయించాలి. ఆర్థిక సమస్యల్ని ఎలా విడదీయాలి, చుట్టాలు పక్కాలతో ఎలా ప్రవర్తించాలి మున్నగు విషయాలన్నీ క్షుణ్ణంగా తెలుసుకుంది.

అంతవరకు జరిగిన కథ బాగానే ఉంది.

ఆ తరవాత జరిగిన కథ అతనిలో అశాంతినీ, ఆలజడినీ రేపింది.

పత్య ఆఫీసు దగ్గరే కనక ( రెండు కిలోమీటర్లుండవచ్చు ) రిక్షాలకి, బస్సులకి డబ్బు ఖర్చు పెట్టకూడదు. బుద్ధిగా ఆఫీసుకి నడిచి వెళ్ళాలి. నడిచి రావాలి. షికార్లూ, స్నేహితులూ అంటూ జులాయిగా తిరిగి, కాలాన్ని వృధా చేయకూడదు. ప్రతి రోజూ ఒ. టి. ( ఆఫీసులో స్టాప్ తక్కువ కనక ఎప్పుడూ ఓవర్ టైమ్ ఉంటుంది. ఓపిక ఉన్న వాళ్ళకి అలవెన్స్ డబ్బుకూడా పైసలతో సహా లెక్క చూపించాలి. పేకాట, మందు పార్టీల పోకూడదు. ఎప్పుడైనా స్నేహితుల బలవంతం



సినిమాకి వెళితే సత్య ఒ. టి. చేసినట్లు అలివేలుతో అబద్ధం చెబుతాడు. అయితే, ఆ మహాడు గంటలకి కూడా ఒ. టి. రేటు ప్రకారం లెక్క చూసి, మొత్తం ఇమ్మని ఆమె డిమాండ్ చెస్తుంది. అలాంటి సందర్భాల్లో సత్య గొంతులో పచ్చి వెలక్కాయ అడ్డు పడుతుంది. అబద్ధ మూ నిజమూ చెప్పలేక, ఆ మహాడు గంటల ఒ. టి. డబ్బు అప్పో సప్పో చేసి సరి పెడతాడు. తలకి మించిన అప్పు పెరిగింది.

ఆమె కుట్టించిన బట్టలే వేసుకోవాలి. ఆమె కొన్న చెప్పులే వాడాలి. ఆమె తీసుకున్న పుస్తకాలే చదువుకోవాలి. ఆమెతోనే వెళ్ళి సినిమా చూడాలి. అన్నీ ఆమే చేస్తుంది. ఆమే అన్నీ చూస్తుంది. అన్నీ. అన్నీ. అన్నీ— ఆమే. ఆమే. ఆమే. ప్రతి దానికి ఆమె బిల్లు పాస్ చేయాలి. అధికారం లేదు. స్వతంత్రం పోయింది. రిక్తహస్తాలూ, జాత్తు పీక్కోడాలు, తల బాదుకోవడాలు మాత్రం సత్యకి మిగిలాయి.

ఒకానొక ఫస్టు తారీఖున సత్య జీతం ప్లస్ ఒటి డబ్బు ఇవ్వగా లెక్కలన్నీ చక్కగా కుదరగా, రాబడిని గ్రాడేజా అలమరలో పెట్టాక ఒక కొత్త ప్రతిపాదన చేస్తున్నట్లు మేడమ్ అలివేలు డిక్లేర్ చేసింది.

"ఏమిటా ప్రతిపాదన?" సత్య అడిగాడు. మాటలో వినిపించకపోయినా కోపం మనసులో వుండు కొంది.

"ఈ నెల నుండి మీ పేర 'సేవింగ్స్' ప్రారంభి స్తున్నాను" అలి వేలు చాలా నిదానంగా మాట్లాడు తుంది. తీసుకున్న నిర్ణయాన్ని క్రమ పద్ధతిలో చెప్పడం ఆమెకి అమూల్ స్ప్రేతో పెట్టిన విద్య.

"అంటే? కంపల్సరీ డిపాజిట్ లాంటిదా?"

"అవును. ఇది సిగరెట్ల డిపాజిట్ స్కీమ్."

"చాలా థాంక్స్. నా సిగరెట్ల కోసం డిపాజిట్ స్కీమ్ చేయడం హర్షిస్తున్నాను."

'తొందరపడకండి. మీరు సిగరెట్లకోసం నెలకి యాభయికిపైగా తగలేస్తున్నారు. డబ్బు, ఆరోగ్యం తప్ప దానివల్ల మీకు కడుపు నిండుతుందా? అందుకని మీరు సిగరెట్లకోసం ఖర్చుచేసేదాన్ని పోస్టాఫీసులో 'ఆర్డీ' వేస్తున్నాను. అయిదేళ్ళలో వచ్చే డబ్బుతో మీకొక సైకిలు కొనాలనుకుంటున్నాను."

"అన్యాయం...."

"ఇందులో అన్యాయం ఏమీలేదు. ఈ నెల నుండి మీకు రూ. 20 మాత్రమే ఇస్తున్నాను."

"అలివేలూ! దారుణం.... నీకు అధికార దాహం పెరిగిపోయింది."

"దాహం కాదు, బాధ్యత పెరిగింది. మీ మాటను సవరించుకోండి."

"సంపాదన నాది. పెత్తనం నీది. కష్టం నాది. సుఖం నీది. ఈ ఇంట్లో సరదాలేదు, ముచ్చట లేదు. ప్రతిక్షణమూ బానిసలా బతుకుతూ చస్తున్నాను."

"మీరు కేవలం సంపాదిస్తున్నారు. అంతటితో మీ బాధ్యత వదిలించుకుంటున్నారు. మరి, నేను?... ఈ ఇంటి గురించి, ఇంట్లో మనుషుల గురించి రాత్రీ పగలూ ఆలోచిస్తున్నాను. మన ఉపయోగం కోసం. మంచి భవిష్యత్తుకోసం ఎన్నో పథకాలు వేస్తున్నాను. మా కష్టె వేను ఎక్కువగా శ్రమ పడుతున్నాను. ఇదే పార్లమెంటులో అయితే— ప్రజలంతా నాకు నీరాజనాలు పట్టేవారు."

మాటకి మాట పెరిగింది.

"చెట్టంత మగాణ్ణి నాకు ముష్టి ఇరవై ఇస్తే ఎలా సరిపోతుంది? ఎన్నో అవసరాలుంటాయి. నా పాకెట్టుమనీ కట్ చేస్తే నేను సహించను."

"చూడండి! ఎదురింటి సముద్రంగారు జేబు ఖర్చుకని నెలకి అయిదుకన్న ఎక్కువ తీసుకోరట. అతనుమాత్రం మనిషికాదా? అతనికీ మీలాంటి జల్సాలుండవా? అయినా—అతను అయిదుతోనే సరిపెట్టుకుంటారు."

"చాల్లే ... వాడొక గడ్డిమోపు వెధవ.....మా ఆఫీసులో వాలిగాడు జారీగా సగం జీతం ఖర్చెట్టుకొని, మిగిలినది ఇంట్లో పతిస్తాడు."

"ఫుట్‌పాత్ మీద బతికే వాళ్ళతో మిమ్మల్ని పోల్చుకోండి. అప్పుడు మీరెంత దర్జాగా బతుకు తున్నారో తెలుస్తుంది."

చిలికి చిలికి గాలివాన మొదలయ్యింది.

"నీ అధికారం వలన ఈ ఇల్లు నాశన మయ్యింది."

"అన్యాయంగా నిందారోపణలు చేయకండి. మీ గుండెలమీద చెయ్యి వేసుకొని, పునరాలోచన చేయండి."

"నీ అధికారంమీద విశ్వాసంపోయింది."

"అది మీ ఒక్కరూ అంటే సరిపోదు. ఈ ఇంట్లో ప్రతి ఒక్కరూ చెప్పాలి."

"నువ్వు అధికారం విడిచిపెట్టాలి."

"అంత సులువుకాదు. మీరు మరచిపోయా రేమో? మూడేళ్ళ గడువు...గడువు తీరేదాకా ఈ అధికారం కొనసాగుతుంది. ఆ రోజు కూడా ఈ ఇంట్లో ఎన్నికలు జరుగుతాయి. అందులో ఎవరు నెగ్గితే, వాళ్ళే అధికారం చేపడతారు."

"ఓహో, అలాగా!...సరే, మూడేళ్ళు నిండక ముందే నీ అధికారానికి నూరేళ్ళు నిండేటట్టు చేస్తాను. నిన్ను దింపి, ఆ స్థానం నే నాక్రమించు కుంటాను. ఈ ఇంట్లో అవిశ్వాస తీర్మానం తీసుకు రాకపోతే నా పేరు 'సత్య' కాదు".

"మీ పేరు సత్యకాదని ఎప్పుడూ ఎవరూ అనరు. నిజంగా మీరన్నట్లు నామీద అవిశ్వాస తీర్మానమే వస్తే, నా పదవికి రాజీనామా చేసి, ఆనందంగా తప్పుకుంటాను."

ఆమె ఇచ్చిన ఇరవై రూపాయలు తీసుకొని, విసురుగా బయటికి వెళ్ళిపోయారు.

వారం రోజులు తల పగలగొట్టుకొని ఆలో చించాడు సత్య. అలివేలు అధికారాన్ని పడగొట్టే పదునైన ఆలోచ ఒక్కటీ అతని తల్లోకి రాలేదు. మూడు సంవత్సరాలు గడువు తీరేక మళ్ళీ ఆమెకే అధికారం రావచ్చును. అప్పుడు మరో మూడేళ్ళు బానిసత్వం అనుభవించాలి. హతోస్మి! ఆ గడువు పూర్తి కాకుండా, ఇంట్లో అందర్నీ కూడ గట్టు కొని, అవిశ్వాస తీర్మానం తీసుకు రావడం తప్ప మరో గత్యంతరం కనిపించడం లేదు. ఉద్యమం మొదలు పెట్టాలి. ఇంట్లో చిన్నా పెద్దా సానుభూతి తొందరగా సంపాదించాలి.

ఇంతకీ ఏలాంటి ఉద్యమం చేపట్టాలి?


చిరకాలము నిలిచియుండు
పరిమళమునకు మరియు
రోజంతా తాజాగా ఉండుటకు
"రంభ" మరికొళందు అత్తరు
మరియు అగరీ టాల్క్




50 గ్రాములు. చిల్లర ధర
రు. 2-45 కు మించరాదు

4 Ml సీసా. చిల్లర ధర
రు. 7-25 కు మించరాదు

మరికొళందు చిన్నసైజు రు. 1-30
మరికొళందు పెద్దసైజు రు 5-25
స్థానిక పన్నులు అదనము
ఇంకను 32 ఇతర రకముల అత్తరుల
కూడ తయారు చేయుచున్నాము.

తయారీదార్లు :
మెస్సర్స్. రంభ కాస్మెటిక్స్
అడయార్. మద్రాసు .600 020.

ఆంధ్రప్రదేశ్ మరియు ఒరిస్సాకు ఏజంట్లు :
మెస్సర్స్. నరేంద్ర ఏజన్సీస్
దుర్గా గ్రోత్ రి. విజయవాడ—520 002

తాజా - వార్తలకు
ఆంధ్రప్రభ దిన పత్రిక
చదవండి

ఢిల్లీ సందర్శించే యాత్రిక బృందాలకు శుభవార్త

మేము మా స్వంత డీలక్స్ బస్సులతో టూరిస్టు సర్వీసులు నడుపుచున్నాం. అత్యుత్తమమైన మా సేవలను ఉపయోగించుకొనండి.

శ్రీనగర్ - గుల్‌మార్గ్ - పహల్‌గాం - అమృత్‌సర్
( నెలకు 4 సార్లు ) టిక్కెట్టు ఒక్కొక్కరికి రు. 300. వసతితోసహా.

బదరీనాథ్ - కేదార్‌నాథ్ ( మే నెల నుండి అక్టోబరు వరకు)
టిక్కెట్టు రు. 300 నుండి రు 350 వరకు వసతితోసహా. )

ఇవిగాక ఢిల్లీ నగర సందర్శనకు, ఆగ్రా, మధుర, బృందావన్, ముస్సోరి, హరిద్వార్, రిషీకేష్ లకు నియమిత కాలంలో బస్సు సర్వీసులు కలవు. వివరాలకు సంప్రదించండి.

**WHILE IN DELHI, STAY AT SOUTHERN GUEST HOUSE (OUR ASSOCIATE CO.,) WINNERS OF GOLD-MEDAL FOR BEST TOURIST SERVICES.**
**Our Receipts valid for LTC/LFC**

("సదరన్ ట్రావెల్స్" ఢిల్లీలోని ఆంధ్రుల ఏకైక వాణిజ్య సంస్థ)

**SOUTHERN TRAVELS (Regd.)**
**Gurudwara Road, Near Vijaya Bank,**
**Karol Bagh, NEW DELHI-110 005.**
**Phones: 568728, 564085**

SUVARNA

ఊరగాయలకు అమూల్యమైన మా నూనెలు
అగ్‌మార్క్ [illegible]

A. S. బ్రాండ్ పప్పు నూనె
మేస్సన్ బ్రాండ్ నువ్వుల నూనె

★ [illegible] ★ [illegible]
★ [illegible] ★ [illegible]

16, 4, 2 కేజీల డబ్బాలలో ప్యాకింగ్ చేయబడుచున్నవి.
ఇండియన్ గవర్నమెంట్ వారి అగ్‌మార్క్ సీలును గమనించి కొనుడు.

డిపోలు: ★ డా. [illegible] స్ట్రీట్, తెనాలి, ఫోన్: 150
★ 1—3—166, రాజా [illegible] స్ట్రీట్, [illegible], సికింద్రాబాద్, ఫోన్: 76160.

[illegible], గుంతకల్, విజయవాడ, ఒంగోలు, మద్రాసు, నంద్యాల, బరంపురం, కలకత్తా, జంషెడ్‌పూర్, నాగపూర్‌లలో మా ఏజెంట్లు కలరు.

స్థాపితం: 1910

Manufacturers

అంబటి సుబ్బన్న & కో; సామర్లకోట

ఇండియాలో కెల్లా పెద్ద అగ్‌మార్క్ జింజిలీ ఆయిలు ప్యాకర్లు

ఆ ప్రశ్నకి సమాధానం దొరకలేదు. అందుకే, సమర్పణరావు దగ్గరికి పరుగెత్తుకు వచ్చాడు.

* * *

"అది, స్వామీజీ...జరిగిన కథ. తమరు నాయందు దయుంచి, ఒక మంచి సలహా పారేస్తే—ఒక మంచి ఉద్యమం మొదలెట్టి, ఒక మంచిరోజున అలివేలుని పడగొట్టి, ఒక మంచి సమయాన అధికారం తీసుకుంటాను" సత్య రెండు చేతులు జోడించి అభ్యర్థించాడు.

సమర్పణరావు చిద్విలాసంగా అభయహస్తం చూపించాడు.

"మన ఉద్యమాల పురాణంలో 'గడ్డం నిరసన' అని ఒక వ్రతం కలదు. అది ఆచరించినచో నీ కష్టాలు గట్టెక్కుతాయి. కోల్పోయిన అధికార సంపద నీకు లభిస్తుంది."

"గడ్డం నిరసన యనా నోషేవ్ షేవింగ్ స్ట్రయిక్. నాకు తికమకగా ఉంది."

"అవును. తొల్లి సాంబుడీ వ్రత మాచరించి, విష్ణుమూర్తిని ప్రసన్నం చేసుకొని, రెండింక్రిమెంట్లు, ప్రమోషనూ, పాత బకాయిలూ, తదితర లాభాలు పొంది, భార్యా బిడ్డలతో సుఖంగా కాలం గడిపెను."

"ఏమా కథ ?"

"అది ఎట్లనన్?...ఇది ద్వితీయా విభక్తి కదూ?"

"నీకు తెలుగు వ్యాకరణం వచ్చని తెలుసు. ఆ వ్రతాల భాషలలో ఏడవక, తెలిసిన తెలుగులో చెప్పరా తమ్ముడూ....సారీ! చెప్పండి స్వామీజీ."

"అటులనే..." అని సమర్పణరావు ఉద్యమ పురాణంలో ఉన్న ఒకానొక కథ చెప్పాడు.

పూర్వం సాంబశివరావన్ ఒకానొక ఎల్డీసీ ఒకానొక ప్రభుత్వ కార్యాలయంలో పనిచేసేవాడు. ఆ ఒకానొక సాంబగారికి చాలాకాలంగా ఇంక్రిమెంట్లు ప్రమోషనూ లేకుండా—ఏ కారణం లేకుండా, ముత్తురామన్‌గారి అబ్బాయి విష్ణుమూర్తిన్ అరవ ఆఫీసరు చేశాడు. తనకన్న జూనియర్లు మీది మెట్లు ఎక్కుతూ ఉంటే—వాటిని లెక్కిస్తూ కింద మెట్టుమీద చతికిలబడ్డ సాంబగారికి సన్యాసం తీసుకోవాలనే విరక్తి అప్పుడప్పుడు కలిగేది. అయితే—సన్యాసం పుచ్చుకోవడంకన్న స్ట్రయిక్‌చేసి సాధించుకోవడం వివేకవంతుల లక్షణం అని ఒక మిత్రుడు సాంబగారికి ఉపదేశం చేశాడు. ఆ ఉపదేశానుసారంగా సాంబగారు 'గడ్డం నిరసన' ప్రారంభించారు. అతని గడ్డం అంతై ఇంతై అడుగున్న పొడవు పెరిగిపోయింది. ఆ కారణంగా అతను గడ్డం పెంచేస్తుంటే 'కారణం ఏమిటని' ఒకరోజున స్టాఫంతా సాంబగార్ని అడిగారు.

సాంబగారు విచారవదనంతో విషయాన్ని వివరించి—"సోదర సోదరీమణులారా! నాకు నిలిపి వేసిన ఇంక్రిమెంట్లు, ఇవ్వవలసిన ప్రమోషనూ, అరియర్స్, ఎట్సెట్రా...ఎట్సెట్రా...ఆఫీసరు గారిచ్చే వరకు ఈ గడ్డం నిరసన కొనసాగిస్తాను. తోటివాడి మీద మీకు సానుభూతి ఉంటే—నా ఉద్యమం దిగ్విజయం కావటానికి మీ చేతులు కలపండి. ముత్తురామన్‌గారి అబ్బాయి విష్ణుమూర్తికి మన బలం ఏమిటో నిరూపించండి" అని ఆవేశ

పూరితంగా ఉపన్యాసం దంచాడు.

"సాంబగారికి ఇంక్రిమెంట్లు ఇవ్వాలి. ప్రమోషన్ ఇవ్వడంలో యాజమాన్యం నిర్లక్ష్య వైఖరిని విడిచిపెట్టాలి. సాంబగారి బకాయిలూ, ఈటీసీ...ఈటీసీ...లు చెల్లించాలి. ముత్తురామన్ గారి అబ్బాయి విష్ణుమూర్తి ఆఫీసరు డవున్ డవున్..." అనే నినాదాలు మొదలెట్టి, ఆ క్షణం నుండి అందరూ గడ్డం నిరసనలో పాల్గొన్నారు.

నెలరోజులు తిరిగే సరికి—ఆఫీసంతా బైరాగి మఠంలా తయారయింది. అందరూ గడ్డాలు పెంచేసుకొని, నినాదాల్ని తత్వాల బాణీల్లో పాడుకోవడం మొదలెట్టారు. ఆడవాళ్ళకి గడ్డాలు ఉండవు గనుక వాళ్ళు పొడుగాటి కురుల్ని విరబోసుకొని ఆఫీసుకి రావడం అలవాటు చేసుకున్నారు.

ముత్తురామన్‌గారి అబ్బాయి విష్ణుమూర్తి లొంగలేదు. ఆ ఆఫీసులో నిర్విరామంగా గడ్డం నిరసన కొనసాగుతుంది.

అదిగో, అలాంటప్పుడు ఆఫీసర్లనుకన్న ఆఫీసరు ఒకాయన ఇనస్పెక్షన్ పనిమీద ఆ ఆఫీసుకు వచ్చాడు.

కారుమేఘచ్ఛాయ జటావల్కధారులై గుమాస్తా పుంగవుల్ని గాంచి, తొల్లి బైరాగి మఠంబని తలచి, వెనుకకి మరలిన వాడై ఉండగా తదీయ ఆఫీసరు బంట్రోతు 'అభాగ్యుల నినాదములు వినుడ'ని విన్నవించెను.

ఆఫీసర్లను కన్న ఆఫీసరుగారికి విషయం తేటతెల్లమై — ముత్తురామన్ గారబ్బాయి విష్ణుమూర్తిని పిలిచి, "సమస్యను వెంటనే పరిష్కరించు, లేకుంటే మనుషుల్లేని చోటుకి నిన్ను బదిలీచేసి, అక్కడ నీకు సాంబారు గతుల్లేకుండా చేస్తాను" అని హెచ్చరించారు.

ము. రా. అ. విష్ణుమూర్తిగారు బెదిరిపోయి, వెంటనే సాంబగారికి అడిగినవన్నీ ఇచ్చేసి ఉద్యమాన్ని స్టాపుచేశారు.

ఆ తర్వాత ఆఫీసు స్టాఫంతా (సాంబగారితో సహా) మహాత్మా గాంధిజీ హెయిర్ డ్రెస్సింగ్ సెలూన్‌కి వెళ్ళి టోకున గెడ్డాలు కొట్టించేశారు.

సమర్పణరావు పై కథను పూర్తిచేసి "కాబట్టి నువ్వు కూడా ఈ వ్రతాన్ని ఆచరించి, నీ ఆశయాన్ని సిద్ధించుకో నాయనా" అన్నాడు.

ఆనందంతో సత్య ఎగిరి గంతేసి — "ఇది నా ఉద్యమానికి సరైన ఆయుధం. నన్ను దీవించండి స్వామీజీ" సమర్పణ రావుకి సాష్టాంగ ప్రణామం చేశాడు.

"ఇష్టఫల సిద్ధిరస్తు ... శుభం ..."

"కథ పూర్తి కాకుండానే శుభం ఏమిటిస్వామీ! వెళ్ళొస్తాను"

"ఫజా? ..."

"ఫీజా? ..."

"అవును. నీ కోసం, ఈ సలహాకోసం నాకు చాలా ఎనర్జీ వేస్టయింది. ఆలోచనలతో తల వేడెక్కిపోయింది. రెండు పాకెట్లు సిగరెట్లు, క్వార్టరు విస్కీ, ప్లేటు బిరియానీ తీసుకుంటేగాని ఈ వేడి దిగదు."

# చతుర్ముఖంగా

## 1 బెత్తం

చేతిలో పౌరుషానికి చిహ్నంగా
ఉపన్యాసంలో ఉద్రేకానికి అనువాదంగా
చెంబాగిరీంద్రుల 'బా' చెనను
చెవులారా వినే వినే మంతదండంగా—
ఉండి ఉండి బేజారెత్తిన బెత్తం
ఉన్నపళంగా ఎగిరిపోయింది
అసలు గొంతుకను పలికించే అడవుల్లోకి
హాలోమని మారుమోగే వెదురు పొదల్లోకి.

## 2. హంస

నీళ్ళమీద తేలుతాను నేను
నురగలకంటే పరమకోమలంగా
చల్లగాలిలో ఊగుతాను నేను
తెరమంచుకంటే పరమశీతలంగా
అందరూ తెగపొగుడుతారు నన్ను
మందగమనానికి మారుపేరని
పేగుమాడినప్పుడు నా దూకుడును
బేరీజు వేసేవారు ఎవ్వరని

## 3. నానుంచి నేనే

ఏమాత్రం నుదురు రగిలినా
వెళిపోతూ వుంటాను
నా తిత్తిని నేనే చీల్చుకుని
నా రక్తాన్ని నేనే వొదులుకుని
ఏమాత్రం మనసు కుదిరినా
పన్నిసూ వుంటాను
నా శ్వాసల్ని నేనే నింపుకుని
నా ఒళ్ళంతా నేనే నిండుకుని

## 4. ఎడారి

ఎడారి నా పేరు ఇసుక నా నోరు
నా మీద తీరం చిలికే నాథులెవరూ లేరు
ఇలా నోరు తెరుస్తూనే పీలుస్తాను ఆవిరిని
కంటికద్దుకుంటాను కదిలే ఒంటెల అడుగుల్ని.
ఎందుకంటారు నన్ను ఎందుకూ పనికిరానని.
ఈసడిస్తారే వట్టి ఇసక దిబ్బను నేనని?
నాకు తెలుసు నేను పొంగితే నయాగారా నౌతానని
కాలం కలిసొస్తే లోకానికి తైలాభిషేకం చేయిస్తానని.

-డా॥ సి. నారాయణరెడ్డి

"స్వామీ! నన్ను క్షమించండి. అలివేలు ఇచ్చిన ఇరవైలో యాభై మాత్రమే పైసలు సుమండీ. మిగిలేయి. ఇప్పటికిది స్వీకరించండి" అని అర్ధ రూపాయి తీసి, సత్య సమర్పించుకున్నాడు.

"ఆల్‌రైట్ ... ఈ సారి వచ్చేటప్పుడు కనీసం కళ్యాణి బీరుకి, క్వార్టరు చికెన్‌కి తీసుకురా..." అర్ధరూపాయి సత్తు అవునో కాదో తేల్చుకొని సమర్పణ రావు సత్యని వెళ్ళొచ్చన్నట్లు చేతితో సైగ చేశాడు.

"చిత్తం."

సత్య నిష్క్రమణతో కథలో ఒక ప్రకరణం పూర్తయింది.

* * * *

సత్య 'గడ్డం నిరసన' మొదలు పెట్టి వారం రోజులు దాటింది.

యథాప్రకారం పనులు పూర్తిచేసుకొని అలివేలు గదిలో అడుగుపెట్టి తలుపులు వేసింది. లైటు తీసి, ఫిఫ్టీ ఫిఫ్టీ బెడ్ మీద నడుం వాల్చింది. భార్యాభర్త లిద్దరూ సరాగా లాడుకుంటున్నారు. గడ్డిపోచల్లాంటి అతని గడ్డం సన్న సన్నగా అలివేలుమెత్తని చెక్కిళ్ళ మీద గుచ్చుకుంటుంది. ఆమె ఇబ్బందిగా ముఖం పెట్టింది. అతను కావాలని ఆమెను మరీ మరీ దగ్గరకు తీసుకుంటున్నాడు.

"ఏమిటిది?" గుచ్చుకోకుండా అని గడ్డానికి చెయ్యి అడ్డు పెడుతూ అడిగింది అలివేలు.

"నిరసన" తన ఉద్యమం తొలి దశలో అడుగు పెట్టబోతున్నందుకు లోపల సంతోషిస్తూ చెప్పాడు సత్య.

"గడ్డానికి పర్యాయపదం నిరసనా?"

"కాదు. గడ్డం నిరసన అని ... ఇదొక ఉద్యమం. నీ అధికారాన్ని పడగొట్టే వరకూ కొనసాగిస్తాను. అప్పటివరకు నేను షేవ్ చేసుకోవడం లేదు జరగదు."


అలివేలు నక్కున నవ్వింది.

"న్యాయం. గడ్డిపోచలు కలిపి పేనితే మోకవుతుంది. ఆ మోకుతో ఎంత మదపుటేనుగునైనా కట్టి పడెయ్య వచ్చు. అలాగే ఈ వెంట్రుకల సాయంతో నీ మీద అవిశ్వాస తీర్మానం తీసుకు వచ్చి, అధికారాన్ని చేజిక్కించుకుంటాను."

"బేష్ ... ఈ ఆలోచన ఎవరిదో కాని బాగుంది. కానీ, నేను మొండిదాన్ని. మీ ఉద్యమానికి బెదిరిపోయి, తొందరపడి పదవీ విరమణ చేస్తాననుకోకండి. నాకు అడ్జస్టు కావడం తెలుసు. సర్దుకోవడం చాతకాని రోజున ఈ సుఖానికి గుడ్‌బై కొట్టేస్తాను. ఓ. కే..."

సత్య డామ్మనిపోయాడు. అలివేలు అతని తలను గుండెల మీదికి లాక్కొని కిలకిల నవ్వింది.

అతను ప్రతి రాత్రి తన గడ్డంతో ఆమెకి ఇబ్బందిని, అసహనాన్ని కలిగించాలని ప్రయత్నిస్తున్నాడు. అధికారం ఇచ్చేసేయ్ ... క్షౌరం చేసుకుంటానని' చెప్పాలనుకుంటున్నాడు. కానీ ఆమె అలాంటి అవకాశం ఇవ్వడం లేదు. ఇబ్బంది పడటం లేదు. అసహనాన్ని అంతకన్న చూపించడం లేదు. అడ్జస్టయిపోతుంది. పైగా—"మీరు గడ్డంతో మహా అందంగా ఉన్నారు. బెర్నాడుషా, శరత్, ఆరుద్ర ఎందరో మహానుభావులు మీలో కనిపిస్తున్నారు.




గడ్డం పెంచుకోవడం, ఉంచుకోవడం కాలేజీ స్టూడెంట్సుకి కూడా ఫాషనయిపోయింది" అంటూ కామెంట్సు ఇస్తుంది. కాంప్లిమెంట్సు అందిస్తుంది.

యథాశక్తి సత్య గడ్డం పెరుగుతూనే ఉంది.

ఆ రోజు సోమవారం.

తలంటు పోసుకుని, విభూతి రేఖలు పెట్టుకొని, కాషాయి రంగు లాల్చి, తెల్లలుంగీ కట్టుకున్న సత్య యథాలాపంగా పెరట్లోకి అడుగుపెడుతుంటే— చీపురు పట్టుకొని తుడుస్తున్న అప్పల కొండ తుళ్ళి పడింది. గుండెలమీద తుపుక్కున ఊసుకుంది.

"సచ్చినోడా! ఎవుడువ్‌రా నువ్వు ... సెప్పాపెట్టకుండా ఇంట్లోకి దూరావు... అమ్మగోరూ! ఈ డెవడో బైరాగోడు గువ్మాల్లోకి ఒచ్చేసినాడండీ... బేగి రారండి" కసాబిసా తిట్టడం మొదలెట్టింది, అప్పల కొండ చీపురు కట్ట ను సత్యమీదికిఎత్తుతూ.

అప్పలకొండ జడుసుకొని, తిడుతుందంటే—సత్య ఎంత అసహ్యంగా కనిపిస్తున్నాడో పాఠకులు ఊహించుకోవచ్చును.

"తిట్టవే. అప్పలకొండా! బాగా తిట్టు. నువ్వు బాగా తిడితే నా వ్రతం ఫలిస్తున్నట్లే ..." సత్య ప్రోత్సహిస్తున్నట్లు అన్నాడు.

"సెమించండి బాబూ! తెలుసుకోలేదు. ఇదేటి బాబూ? ఈ బూపోడేసం ... తిరపతెల్తున్నారా? ఏటి?"

అప్పలకొండ అనాయకంగా అడిగే సరికి—సత్య జరిగిన కథ వినిపించాడు. అతని మీద అప్పలకొండకి బోలెడంత సానుభూతి ఏర్పడింది. అతనికి తెలుసు—ఆ ఇంట్లో అందరి సపోర్టు కూడగట్టుకోవాలంటే, మొదట క్రిందిస్థాయి పనివాళ్ళ సానుభూతి సంపాదించుకోవాలి. అసలు ఈదేశంలో చాలా మంది నాయకులు సురికి మనుష్యులసాయంతో మీదికి వచ్చినవారే.

అంతలో అలివేలు అక్కడికి వచ్చింది.

"అమ్మగోరూ! ఇదన్నేయం అండీ ... సెట్టంత మారాజుని ఒడిసిపెట్టి, ఇంటిని మీచేతుల్లో ఎట్టుకోడం శానా అన్నేయం అండీ. మీ పదికారం ఒగ్గాలండీ. బాబుగోరి కిచ్చియండీ ... ఒక సుట్టు ఆ బాబు కాసి సూడండీ ... అడుక్కుతినే సన్నాసి నాగా అయిపోనారు. నానే పోల్చనేక పోయానంటే నాకే సీసీ అనిపించింది. మరి బయిటోళ్ళు చూస్తే ఎలా గుంటాది? మీ ఇంటి పరువే టపుద్ది. మిమ్మల్ని నీసుకంగా మాటాడతా రమ్మగోరూ! నా మాటిని కొని, పదికారం బాబుగోరి కిచ్చీయండి. నేనంటే వాను స్టయికు జేస్తాను. మిమ్మల్ని డౌన్ డౌన్ అంటాను. ఏటంటారు?" అప్పలకొండ గుక్కతిప్పుకోకుండా ఆవేశంగా మాట్లాడేసరికి, అలివేలు ఒక్క క్షణం విస్తుపోయింది.

"ఏమిటే, నన్ను డౌన్ డౌన్ అంటావా? సరి ఈ రోజు తారీఖు ఎంత?" అలివేలు ఒక నిర్ణయానికి వచ్చింది.

"పదో తారీఖు. ఏం, ఎందుకని?" విషయం అర్థంకాక సత్య ప్రశ్నించాడు.

"ఓసేవ్, అప్పలకొండా! లెక్కచూసి, నీ జీతం ఇచ్చేస్తాను. నువ్వు రేపట్నుంచి పనిలోకి రానవసరంలేదు."

అప్పలకొండ లబోదిబో మంది.

"ఇదన్యాయం... న్యాయం మాట్లాడినందుకు ఉద్యోగం ఊడపీకడం అక్రమం. నీ నిరంకుశత్వం పెరిగిపోతుంది. నేను సహించను" సత్య ఇంచుమించుగా అరిచాడు.

"ఈ ఇంట్లో అత్యవసర పరిస్థితి అమల్లో ఉంది. దాన్ని అతిక్రమించిన వాళ్ళకి ఇలాంటి శిక్ష తప్పదు." అలివేలు అధికార పూర్వకంగా మాట్లాడి, అక్కడినుండి చరచరా వెళ్ళిపోయింది.

నలితం అప్పలకొండ ఉద్యోగం ఊడింది. రెండవదశకి చేరుకున్న ఉద్యమం విఫలమయింది.

* * *

అర్ధరాత్రి దయ్యం కల రాగా, జడుసుకున్న ఆరేళ్ళ బుచ్చిబాబు అరున్నొక్క రాగం అందుకున్నాడు.

బెడ్‌లైట్ వెలుగులో కాగితాలు పరుచుకొని,

నవభారత్ వారి నూతన ప్రచురణలు



నవలా భారత్ - 1980

గ్రీష్మతాపానికి నూతన నవలా కూల్ డ్రింక్స్!

1. అపురూప — మాదిరెడ్డి సులోచన — 12-50
(సీరియల్‌గా వెలువడకుండా నేరుగా సమర్పిస్తున్న నవల)

2 నెలవంక — ,, — 12-50
(మహిళ మాసపత్రిక సీరియల్)

3 సృష్టిలో తీయనిది — ,, — 15-00
(ఆంధ్రభూమి వారపత్రిక సీరియల్)

4. కలహంస — ,, — 12-50
(ప్రభవ మాసపత్రిక సీరియల్)

5. ప్రేమనక్షత్రం — కొమ్మూరి వేణుగోపాలరావు — 1.-50
(ఆంధ్రజ్యోతి వారపత్రిక సీరియల్)

6. కోటిగాడు — కె రామలక్ష్మి — 7-50
(ఆంధ్రపత్రిక వారపత్రిక సీరియల్)

7. సినీ జనారణ్యం మొదటిభాగం-యస్. ఆర్. నంది — 10 00
(ఆంధ్రజ్యోతి వారపత్రిక సీరియల్)

8. సినీ జనారణ్యం రెండవ భాగం — ,, — 10 00

9. హరిశ్చంద్రమతి — బీనాదేవి — 10-00
(ప్రభవ మాసపత్రిక సీరియల్)

10. కలల వెలుగు — మాలతీ చందూర్ — 10-00
(సీరియల్‌గా వెలువడకుండా నేరుగా సమర్పిస్తున్న నవల)

11. శివకాంత (కథా పద్మహారం) — పురాణం సుబ్రహ్మణ్య శర్మ — 10-00

12. సెన్స్-సెన్స్ — డా॥ నమరం — 15-00
(మూఢ ఆచారాల అజ్ఞానపు చీకట్లను పారద్రోలే విజ్ఞానజ్యోతి)

అన్ని బుక్‌స్టాల్స్‌లోను లభించును.

అడ్వాన్స్ పంపినవారికి మాత్రమే V.P.P. లో పంపబడును

నవభారత్ బుక్ హౌస్. విజయవాడ 520002


ప్యూవరు ప్లీస్సు వేస్తున్న సత్య కళ్ళెర్ర జేసి, కొడుకువేపు చూశాడు. ఎర్రటి కళ్ళు, బారెడు గడ్డం, పిచ్చుక గూడులాంటి జుత్తు చూచిన బుచ్చిబాబు—కలలో దయ్యం నిజంగా బయటికి వచ్చిందని భయపడి, పరుగెత్తుకెళ్ళి వాళ్ళమ్మను వాటేసుకున్నాడు.

బుచ్చిబాబు జడుసుకున్నాడు. జ్వరం పెట్టు కున్నాడు. మంచం పట్టాడు. మంత్రాలు తంత్రాలూ మందులు మాకులూ, డాక్టరు వైద్యాలూ ఏమీ పనిచేయలేదు. బుచ్చి రోజు రోజుకీ నీరసించి పోతున్నాడు. తండ్రిని చూసినప్పుడల్లా పిచ్చి కేకలు వేస్తూ, ఇంట్లో పెద్ద హడావుడి చేస్తు న్నాడు. పరిస్థితి అధ్వాన్నంగా తయారయింది. ఇంట్లో ఆందోళన హెచ్చింది.

సత్యకి లోలోపల ఆనందంగా ఉంది. బుచ్చి మామూలు స్థితికి రావాలంటే తను గడ్డం నిరసన విడిచిపెట్టాలి. నిరసన విరమించాలంటే అలివేలు అధికారం విడిచిపెట్టాలి. సరాయిపాలన్ని పారద్రోలే సదవకాశం లభిస్తుంది. అందుకే—అప్పుచేసి, దర్జాగా సిగరెట్లు, మందుపార్టీలు లాగించేస్తు న్నాడు. .ఉద్యమం మూడవదశకి చేరుకుంది.

ఇంట్లో పెద్దవాళ్ళకి, చిన్నవాళ్ళకి కొంచెం కొంచెం అర్థం అవుతుంది—బుచ్చి జడుసుకొని, మంచం పట్టడానికి కారణం జడల బ్రహ్మరాక్షసిలాంటి సత్య గడ్డమే అని.

"ఏమ్మా? అబ్బాయి తిరుపతి వెళ్ళాలను కుంటున్నాడా?" సత్య తండ్రి గురులింగంగారు కోడల్ని పిలిచి అడిగారు. అతను కొడుకుతో ఎప్పుడోగాని ఒకటీ అరా తప్ప మాట్లాడరు. ఎక్కువగా కోడలితోనే మాట్లాడుతారు.

"ఏమో? అనుకుంటున్నారు కాబోలు మామ గారూ!" అలివేలు తనకేమీ తెలీదన్నట్లు చెప్పింది.

"అబ్బా! అన్నయ్య గడ్డం చూస్తుంటే నాకే భయంగా ఉంటుంది. అన్నయ్యను తొందరగా తిరుపతి వెళ్ళి రమ్మని చెప్పొదినా...ఊ....లేకుంటే బుచ్చి మనకి దక్కడు" సత్య తమ్ముడు ఏడుపు మొహం పెట్టాడు.

"అవునొదినా!...బుచ్చి లేకపోతే నేనూ బతకను" సత్య చెల్లెలు బావురుమని ఏడ్చేసింది.

నిజమే మరి. మరి కొన్ని రోజులు అశ్రద్ధ చేస్తే నిజంగా బుచ్చిబాబు కనిపించడు. ఆ తల్లి మనసు కలుక్కుమంది.

ఆ రోజు రాత్రి అలివేలుకి, సత్యకి వాగ్యుద్ధం జరిగింది.

"బుచ్చి బెంగ పెట్టుకున్నాడు."

"తెలుసు."

"మీ మూలంగానే వాడు మంచం పట్టాడు"

"తెలుసు."

"మీ ఉద్యమం విరమిస్తే, వాడు మనకి దక్కుతాడు."

"తెలుసు."

"తెలుసు ... తెలుసు ... తెలుసు ...మరెందుకీ ఉపేక్ష? వెంటనే ఏ సెలూన్‌కో వెళ్ళి రండి."

"అంటే? నీ అధికారానికి రాజీనామా

చేస్తున్నట్లేనా?...ఏవీ ఇంటి తాళాలు.

"అంటే? నేను రాజీనామా చేయకపోతే—కన్న కొడుకు పోయినాపరే మీరు లెక్కచేయరన్న మాట..."

"నేనూ అదేమాట అంటున్నాను—నీకు అధికారమే గాని కన్నకొడుకు అవసరంలేదన్నమాట..."

"నా అధికారంలో లోపం ఏమిటి? ఎవరు వస్తుపోతున్నారో చెప్పగలరా?"

"నీ అధికారంలో అనక తవక లెన్నో ఉన్నాయి. అందరికీ తెలుసుకానీ, నువ్వు పెట్టిన యమయర్జన్సీకి నోళ్ళు కుట్టుకున్నారు. ఇక నష్టపోయేది ఎవరంటావా? ముఖ్యంగా నేను...నేనూ..."

"కల్ల బొల్లి కబుర్లు చెప్పకండి. నేనన్నా నా అధికారమన్నా మీకు అసూయ, ద్వేషం.... అందుకే, ఈ ఇంట్లో ఏదోరకంగా ఆందోళన లేవదీసి, నన్ను పదవినుండి తొలగించాలని కుట్ర చేస్తున్నారు"

"నువ్వు ఎలా అనుకున్నా అభ్యంతరం లేదు. కానీ, సాధించేవరకు ఈ ఉద్యమాన్ని విడిచిపెట్టేది లేదు." చాలా ఖచ్చితంగా ఆవేశంగా సత్య చెప్పాడు.

"ఆల్ రైట్...మీ ఉద్యమానికి తల ఒగ్గే పిరికితనం, బలహీనత నాలో లేవు." అలివేలు గుండె నిబ్బరంతో అంది.

"కానీ బుచ్చికి ఏమైనా ప్రమాదం జరిగితే, ఈ ఇంట్లో నీకు స్థానం ఉండదు."

"నా అధికారం ఎలా కాపాడుకోవాలో నాకు బాగా తెలుసు" అచంచలమైన ఆత్మ విశ్వాసంతో అక్కడనుండి కదిలి వెళ్ళిపోతున్న అలివేలు అపర రాజకీయవేత్తలా కనిపించింది, సత్య కళ్ళకి.

నాలుగురోజులు వరసగా బుచ్చిని ఏకాంతంగా ఇంటి పరిసరాలకి దూరంగా తీసు కెళ్ళింది అలివేలు. పూర్వం పురాణ పురుషులు మొదలు ఈనాటి రాజకీయ నాయకుల వరకు సంబంధించిన కథలూ గాథలూ ముఖ్యంగా గడ్డాలతో కనక్టయిన కథలు చెప్పింది. ప్రపంచ చరిత్ర తిరగేస్తే గడ్డం ఉన్న వాళ్ళే మహా ఋషులుగా, మహాపురుషులుగా, మహా మేధావులుగా ప్రసిద్ధి చెందారు. గడ్డానికి, మేధస్సుకి ఎక్కడో లింకు ఉంది. మగవాళ్ళకి 'గడ్డాలు మీసాలు' అనేవి అందమైన వరంగా దేవు డిచ్చాడు. ఈ రోజున బాగా పేరు పొందిన రాజకీయ నాయకులు, సినిమా మనుషులు, క్రికెట్ ఆటగాళ్ళు మనకి గడ్డాలతోనే దర్శనమిస్తుంటారు. అది ఫాషన్ కాదు. వాళ్ళ గొప్పదనానికి చిహ్నం. దశరథ మహారాజు గడ్డం చూసి, శ్రీరామచంద్రుడు జడుసు కోలేదు. వసుదేవుడి గడ్డం చూసి శ్రీ కృష్ణుడు జ్వరం తెచ్చుకోలేదు. ఛత్రపతి శివాజీ గడ్డం చూడ ముచ్చటగా, ఎంతో అందంగా ఉంటుంది. 'బుజ్జీ! మీ నాన్నగారు గొప్పవారు కావడం నీ కిష్టం లేదా?" గడ్డాల మహానుభావుల చిత్రా లెన్నో బుచ్చిబాబుకి చూపించిన తరవాత లాలనగా అలివేలు అడిగింది. బుచ్చి కన్విన్సయ్యాడు.

'నిజమే! క్రిస్మస్ తాతకి తెల్ల గడ్డం పెద్దగా

## అంతరంగం

ఆలోచనల ముడిని
విడదీసి
కర్తవ్యాన్ని బోధించే
మేధావివి!
హితాహితాలు బేరీజు వేసే
న్యాయమూర్తివి!
నీవు మెదలక ఆగితే
అమావాస్య రాత్రిలా
అంతా శూన్యం
అయోమయం!
నీవు కదిలితే
నీ జాడలో,
నీలి నీడల్ని
జడలు రబోసుకున్న ఇరుల్ని
దాటుతూ —
నిరంతర యాత్ర సాగిస్తాను
ఇంతకూ —
నీ వెవరనీ!
నీ వెవరో కాదు
'నీవే' నాలో 'మనసు'

\- జి. పలావతి

ఉంది. చందమామ పుస్తకంలో బారెడు గడ్డం పొట్టి వాడి కథ చదివి, అత్తయ్య చెప్పింది. ఆ గడ్డంతో ఎన్నెన్నో వింతలు చేశాడు. ఆ బొమ్మలు చూసినప్పుడు, ఆ కథలు విన్నప్పుడు తను భయపడ లేదు. డాడీని చూసి ఎందుకు జడుసు కోవాలి? డాడీకి గడ్డం ఎంతో బాగుంటుంది' అని బుచ్చి ఆలోచించాడు.

వారం రోజుల్లో బుచ్చిబాబు మామూలుగా తయారయ్యాడు. ఇప్పుడు వాళ్ళ డాడీ గడ్డంతో సరదాగా ఆడుకుంటున్నాడుకూడా. పరిస్థితి చక్కబడినందుకు అలివేలు తృప్తిగా నవ్వుకుంటుంది. అది చూసి సత్య ఉడికిపోతున్నాడు. తన అసహాయతకి బాధ పడిపోతున్నాడు.

రెండు వందల సంవత్సరాలు ఏకచ్ఛత్రాధిపత్యంగా పరిపాలించిన ఆంగ్లేయుల్ని అహింసా వాదంతో హడిలి కొట్టి దేశం నుండి వెడలి గొట్టి మనకి స్వాతంత్ర్యం సంపాదించాడు జాతి పిత మహాత్మా గాంధీజీ. కానీ, తను? కేవలం రెండే రెండేళ్ళు హింసావాదంతోనైనా ఆఫ్టరాల్ అలివేలు అనుభవిస్తున్న అబల అధికారాన్ని పడగొట్టలేక, ప్రతి తడవా బోర్లా పడుతున్నాడు, సత్య.

సమర్పణరావు సలహా వృథా అయిపోతుందేమో నని, ఎప్పుడూ అలివేలు అధికారంలో బానిసత్వంలో బాధపడాలిసిందేమోనని బెంగ పెట్టుకుని, సత్య ధారాపాతంగా కన్నీళ్ళు విడుస్తున్న ఒకానొక సమయంలో "రేపు మనింటికి అతిథులు వస్తున్నారు?" అంది



అలివేలు ఏదో చర్చ నియామంకానికి నాంది పలుకుతున్నట్లు.

"అంటే, ఫారినర్స్ వస్తున్నారన్న మాట. విదేశీయులతో రాజకీయ సంప్రదింపు ల్లాంటివి ఏవైనాఉన్నాయా?" చాలా వ్యంగ్యంగా సత్య అడిగాడు.

"మీరు ఎలా అనుకున్నప్పటికి ఇబ్బంది లేదు. వస్తున్న వాళ్ళు మీ చెల్లెల్ని చూసుకోవడానికి మనతో సంబంధం కుదుర్చుకోవడానికి. రేపు మీరు ఆఫీసుకి సెలవు పెట్టండి".

"చిత్తం"

'ఈ ఇంటి రాజకీయ సమరంలో చివరి ఘట్టం రేపు మొదలవుతుంది. దాంతో అలివేలు అందరి ముందు అవమానం పాలు కావడం, అధికారాన్ని తప్పనిసరిగా విడిచి పెట్టడం జరిగి తీరుతాయి." అని సెంట్ పర్సెంట్ నమ్మకాన్ని కలిగిస్తూ, సత్య మనసు చెప్పింది.

పెళ్ళి వారు వచ్చారు. అబ్బాయికి నచ్చడం, అమ్మాయి అబ్బాయిని చూసుకోవడం, పెద్దవాళ్ళు కట్నాలు కానుకల వరకు మాటలు కొనసాగించడం జరిగిపోయాయి.

పెళ్ళి కొడుకు తల్లీ, బామ్మగారూ పెళ్ళి కొడుకు తండ్రిని చాటుకి పిలిచి రహస్యంగా ఏవో మాట్లాడుకున్నారు.

"చూడండీ! ఈ అబ్బాయి ఎవరో మాకు పరిచయం చేయలేదు"

పెళ్ళి కొడుకు తండ్రి సత్యను చూపిస్తూ గురులింగంగార్ని అడిగాడు.

"సారీ మీకు పరిచయం చేయడం మరిచి పోయాను. వీడు నా పెద్దవాడండీ. పేరు సత్యన్నారాయణ" గురులింగంగారు పరిచయం చేశారు.

"కాదు. కావాలని మరిచి పోయారు".

"అంటే?"

"మీ వాడికి పిచ్చి ఉందని మాకు తెలిస్తే మీ సంబంధం వదులుకుంటామని."

గురులింగంగారు గొల్లున నవ్వారు.

"మా వాడికి తిరపతి మొక్కుబడి ఉంది. అందుకే, జుత్తు పెంచుకుంటున్నాడు. బహుశా, మీకు పిచ్చివాడిలా కనిపిస్తున్నాడేమో? కానీ మా ఇంటా వంటా పిచ్చి అనేది లేదు."

"పెద్దవారు, అబద్ధా లాడకండి. వచ్చినప్పటి నుంచి చూస్తున్నాం. మాటా పలుకూ లేదు. పైగా వెర్రి చూపులు, పిచ్చి చేష్టలు. ఇంటికి పెద్దవాడు, తండ్రి తరవాత తండ్రిలాంటి వాడు. ఏ బాధ్యత లేకుండా అలా పట్టనట్లు కూర్చుంటాడా? ఆ అమ్మాయి మీ కోడలనుకుంటాను. అన్నింటా తనే కల్పించుకుంటుంది. మీ రెంత దాచినా, పిచ్చి మీ వారసత్వం అని తెలుస్తుంది."

"నోరు పారేసుకోకండి. మీ కెంత కట్నం కావాలో అడగండి. చేతనయితే ఇచ్చుకుంటాం. లేకుంటే, మీ సంబంధం విడిచి పెట్టుకుంటాం. అంతేకాని."

"మీ డబ్బుకి కక్కుర్తి పడి, మీ పిచ్చి సంబంధం చేసుకుంటామని ఆశ పడకండి. ఆవేశ పడుతున్నారు

కాని మీ అబ్బాయిలో ఏమైనా బలహం కనిపిస్తుందా?

గురులింగంగారు కోపంగా కొడుకు వేపు చూశారు.

సత్య అయోమయంగా ఎటో చూస్తూ ఉండి పోయాడు.

"ఏరా, నీకే వచ్చింది? నువ్వు పిచ్చి వెధవ్వి కాదని వాళ్ళకి తెలియదోయ్." గురులింగంగారు గట్టిగా కేక వేశారు. సత్య మౌనంగా ఉండిపోయాడు. పైగా జీనియస్ యాక్టరులా పిచ్చి ఫోజు లిస్తూ చిటికీ మాటికీ పిచ్చిక గూడు లాంటి గడ్డాన్ని పీక్కోవడం మొదలెట్టాడు.

"అయ్యా! మీ కో నమస్కారం. మీ వాణ్ని వెంటనే వాల్తేరు తీసుకు వెళ్ళండి" పెళ్ళి వారు లేచి, వెళ్ళి పోయారు.

గురులింగంగారు అవాక్కయి పోయారు. గుండెల మీద కుంపటి. ఆ కుంపటి కన్నీరుగా చూడలేని శివమ్మగారు బావురుమన్నారు. ఆమె ఏడవడానికే ఎప్పుడూ ప్రిఫర్ చేస్తారు. కొన్ని క్షణాలు సీరియస్‌గా గడిచిపోయాయి.

"అంతగా ఇష్టం లేకపోతే చిటికెడు విషం ఇచ్చి దాన్ని చంపేస్తే సరిపోతుంది. అంతేకాని ఈ ఇంటికి వంశానికి ఒక మచ్చ తేవడం నేను సహించను. అసలు నువ్వెందుకీ ద్రోహం చేస్తున్నావు" ఇంట్లో పిల్లలు పెద్దలు గది నిండా ఉన్నారు. బరువైన నిశ్శబ్దాన్ని బ్రేక్ చేస్తూ జీవితంలో మొదటిసారి గురులింగంగారు కొడుకును నిలదీశారు.

"నేను ద్రోహం చేయడం లేదు. నిరసన చేస్తున్నాను" పాయింట్‌ని అందరి ముందుకి తెస్తూ సత్య అన్నాడు.

"ఎవరి మీద?"

"మీ కోడలు మీద".

"అంటే? అలివేలు మీద."

"అవును. ఈ ఇంటి అధికారాన్ని తన గుప్పెట్లో ఉంచుకుని, మనల్ని హీనాతిహీనంగా చూస్తుంది." పైటిల్సు మొదలుకొని యాంటీ క్లయిమాక్స్ వరకు వాళ్ళిద్దరి మధ్య నడిచిన ప్రతి సంఘటన స్క్రీన్ ప్లే చేశాడు, సత్య.

"ఒహో! ఇది మొక్కుబడి కాదన్నమాట" పూర్తి కథ విన్నతరవాత గురులింగంగారు బరువుగా అయోమయంగా నిట్టూర్చారు.

"అవును. ఇది మొక్కుబడి కాదు. మేడమ్ అలివేలు గారి ప్రభుత్వాన్ని పడగొట్టడానికి నేను చేస్తున్న ఉద్యమం. చాలా కాలంగా ఈ ఉద్యమం కొనసాగుతున్నప్పటికి మేడమ్ గారిలో కించిత్ చలనం లేదు. ఈ ఇంట్లో అన్యాయం జరిగిపోతుంది. మీ అందరి సహాయ సహకారాలూ కావాలి. మనవంతా ఒక్కటిగా నిలిచి పోరాడితే, ఈ ఉద్యమం జయప్రదం అవుతుంది. అవును—మీ అందరి కళ్ళు తెరిపించడం కోసమే ఈ రోజు పెళ్ళి వారు ముందు అలా ప్రవర్తించాను. అందుకు నన్ను క్షమించండి. కానీ, నా బాధా గాధా విన్నారు. మీ చేతులు కలపండి. సంఘటితంగా, అవిశ్వాస తీర్మానం చేసి, మేడమ్ అలివేలుగార్ని అధికార పీటం నుండి తొలగించుదాం. ఒక ఆడదాని పరిపాలనలో బానిసగా బతకడం నేను సహించలేక పోతున్నాను". ప్రతిపక్షం పార్టీ నాయకుడిలా గుక్క తిప్పుకోకుండా సత్య మాట్లాడేసరికి అందరూ ఆలోచనలో పడిపోయారు.

అలివేలుకి కోపం వచ్చింది.

"ఈ ఇంటిని దక్షతగా బాధ్యతగా గుట్టుగా గౌరవంగా, ఏ కష్టం ఇబ్బందీ లేకుండా సాఫీగా నడిపించాలి కాని అధికారం చేపట్టింది ఆడది మగాడు అన్నది ప్రశ్న కాదు. మీ స్వార్థం కోసం అందర్నీ రెచ్చగొడుతున్నారు. నా మీద మీరు చేస్తున్న ఆరోపణలు ఏమిటో చెప్పగలరా?"

"తప్పకుండా. నాన్నగారికి స్వీట్సంటే ఎంతో ఇష్టం. ఖర్చు దండగని ఆలోచించావు కాని ఒక్క నెలలో అయినా అతను కోరుకున్నవి చేసి పెట్టావా?"

"ఆతనికి డయాబిటీస్ ఉన్న సంగతి మీకే కాదండి—మావగారికే తెలీదు. డాక్టరుగారు నాతో చెప్పారు. మావగారి ఆరోగ్యం కాపాడవలసిన బాధ్యత నా కుంది."

"అబద్ధం. అమ్మకి చప్పిడి కూరలు, అనవసరమైన పథ్యాలతో అత్తగారినే యిబ్బందింపుతో బాధ పెడుతున్నావు."

"రక్తం పోటు ఉన్న వాళ్ళకి ఏమిటి ఇవ్వాలో మీకు తెలుసా?"

"సరే అబద్ధం...కాలేజీకి వెళ్తున్నాడని వాడికీ కొన్ని సరదాలు ఉంటాయని ఆలోచించి, మీ మరిదికి ఎప్పుడైనా అడిగిన వెంటనే డబ్బు ఇచ్చావా?"

"విలాసాలకి అలవాటుపడితే, చదువు శూన్యం అవుతుంది."

"ఇదొక అబద్ధం...కట్నా లివ్వడానికి కక్కుర్తి పడి, మంచి సంబంధాలు రాకుండా మా చెల్లెకి అన్యాయం చేస్తున్నావు."

"కాదు—డబ్బుతో కొనలేని మంచి మనసున్న మనిషిని ఈ ఇంటి అల్లుడిగా కోరుకుంటున్నాను."

"మరో అబద్ధం...మొక్కా మోహం తెలీని వాళ్ళకి పదులకి పదులు చిరాకాలివ్వడం, పుట్టింటి వాళ్ళకి విలువైన కానుకలు పంపించడం—అధికారం దుర్వినియోగం చేయడం కాదా?"

"కాదు...కాదు. ఒకటి—మనాసుగారి అదృష్టం చాటడంకోసం, రెండోది—మన ఇంటి గౌరవం పెంచడంకోసం."

"అబద్ధం...అబద్ధం...అబద్ధం."

"అవును. మీకు ఆసరాల అనడం బాగా తెలుసు. మనిషికి మనస్సాక్షి కావాలి. అధికారం దాహం నా క్యారెక్టర్ డీ—మీకు...మీకు నిక్కు వస్తుంది. అందుకే ఈ ఆందోళన లేవదీస్తున్నారు."

ఆ రోజు ఆ ఇంట్లో పార్లమెంటు సెషన్స్ హోరాహోరీగా జరిగాయి. తరవాత తరవాత ఒకరూ ఒకరూ రంగంలోకి ప్రవేశించారు. వాదోపవాదాలు పెచ్చుపెరిగాయి. మగవాడిమీద ఆడది పెత్తనం చేయటం అనాచారం అన్నారు. ఆడది ఎప్పుడూ ఒక మెట్టు కిందికే ఉండాలన్నారు. తత్ఫలితంగా అలివేలుమీద ఏకగ్రీవంగా అవిశ్వాస తీర్మానం ప్రకటించబడింది.

"అప్పగుతెండి. మీరంతా అతని సొంతం. అతని సమస్యలు. నేనా మీలో ఒకదాన్నని గుర్తించగలిగితే—ఇలా మీరంతా దాడిచేయరు. ఆల్ రైట్. మీ మాటను శిరసావహిస్తాను. రేపు ఆదివారం. ఈ ఇంటి అధికారం మీ అందరి సమక్షంలో అతనికి అప్పగించి తప్పుకుంటాను" అని ... తన ఆత్మ విశ్వాసంమీద అందరూ కలసి ... తీసినందుకు అలివేలుకి కన్నీళ్ళు


నల్లులా?

RADEUS/R-T-3

వాడకానికి- తయారుగాఉన్న

క్రొత్త

టిక్-20 ®

నల్లులను తక్షణమే నాశనం చేస్తుంది

డబ్బును ఆదాచేయండి.
నల్లులను చంపు దీనికి
కిరసిను అక్కర్లేదు.
అతి సులభం!



రాలీస్ ఇండియా వారి
ఉత్పాదన

కొనండి టిక్-20 నేడే-నిద్రపొండి హాయిగా ఈ రాత్రి

వచ్చాయి.

"నీ కన్నీళ్ళకి ఈ ఉద్యమం ఆగిపోతుందని, నా ఆరోపణలు ఉపసంహరించుకుంటానని, అధికారం నీ చేతుల్లో విడిచిపెడతానని ఆపోహ పడవద్దు, మేడమ్!" సత్య చాలా వ్యంగ్యంగా అన్నాడు.

పదవి త్యజించిన ప్రధాన మంత్రిలా అలివేలు అక్కడనుండి నిష్క్రమించింది.

రాత్రి పదిగంటలయ్యేసరికి ఇంట్లో పద్దు మణిగింది.

అలివేలు ఫోంచేయలేదు. ఇంట్లో ఎవరూ ఆమెని ఫోంచేయమని గాని, ఫోంచేద్దామనుకుంటే ఆని గాని అడగలేదు. అలివేలు అలమరా సేఫ్టీ లాక్ తెరిచి ఒక ఫైలూ, కొన్ని ఉత్తరాలు బయటకి తీసి—ఒకసారి అన్నీ తిరగేసింది.

చాలా రోజుల తర్వాత సత్య సుష్టుగా భోంచేశాడు. స్పెషల్ కిళ్ళీ వేసుకొని, ఖరీదైన సిగరెట్టు వెలిగించాడు. మరో ఇరవై నాలుగ్గంటల్లో తన చేతికి అధికారం వచ్చేస్తుందని, మళ్ళీ పూర్వంలా విలాసంగా, కులాసాగా, దర్జాగా తిరగవచ్చని బోలెడంత సరదాగా ఉన్నాడు.

"కంగ్రాచ్యులేషన్స్" అప్పుడే గదిలోకి అడుగు పెట్టిన సత్యకి అభినందనలు తెలిపింది, అలివేలు.

"థాంక్స్..." సత్యకి లోపల నవ్వు తన్నుకు వస్తుంది. అయినా అతను నవ్వకుండా, గంభీరంగా అన్నాడు.

"అనుకున్నట్టు—అనుకున్నది సాధించారు."

"అన్యాయాన్ని నేను సహించలేను."

"పాపం! కానీ, ఈ ఇంట్లో అవినీతిని ఎవరూ సహించలేరు, మీరు తప్ప."

"అంటే?..."

"అమాయకంగా ఫోజు పెట్టకండి...ఈ ఫైలూ ఉత్తరాలూ చూడండి. విషయం ఏమిటో తెలుస్తుంది. మీలో ఉన్న విషం కాస్త విరుగు తుంది." అలివేలు ఫైలూ, ఉత్తరాల దొంతర అతని ముందుకి విసిరింది.

"ఏమిటిది?... ఏమిటిది?.." అచేతనంగా సత్య కంగారుపడ్డాడు.

"అందులో మీ క్రిష్ణలీలలు, రాసక్రీడలు ఉన్నాయి. రేపు నాచేత రాజీనామాచేయించి, మీరు పదవీ స్వీకారం చేస్తారో లేక— రాజకీయ రంగంనుండి తప్పుకొని పదవీత్యాగం చేస్తారో నిర్ణయించుకోండి." ఆ రెండు మాటలు చెప్పి, వంటగదివేపు అలివేలు వెళ్ళిపోయింది.

సత్య గబగబా ఫైలూ: ఉత్తరాలు తిరగేశాడు.

సత్యకి నూనూగు మీసాలు వచ్చినప్పుడు మొదలయిన తొలి ప్రేమ (పక్కింటి వరిదాతో) మొదలుకొని నిన్న మొన్నటి ప్రేమాయణం (ఆఫీసు అమ్మాయి అజంతాతో) వరకు రాయ బడి ఉంది. తనకి జ్ఞాపకంలేని గర్ల్ ఫ్రెండ్స్ అందరి ఫోటోలు సీరియల్ ఆర్డరులో ఇయర్ వైజుగా అల్బమ్‌గా చేసి ఉన్నాయి. ఎందరో సుందరాంగులు రాసిన ప్రేమలేఖలు, వాటికి తనిచ్చిన పసందైన జవాబులు—తారీఖా నెలా

**మనిషి లోభి కానవసరంలేదు అంటే 'దుబారా' మనిషి కావాలని అర్థంకాదు.**

—హోరేస్

**దేశం ఎంత స్వతంత్రమైనా ప్రజా స్వామికమైనా, డబ్బు సంపన్నుల వర్గాన్ని తయారుచేస్తూనే ఉంటుంది.**

—బల్వర్

సంవత్సరంతోంటి వాటితో సహా తప్పులు కనిపించ కుండా ఫైలు చేసి ఉన్నాయి.

సత్య గుండెల్లో దడ మొదలయింది. ఆ ఫైలూ, ఫోటోలు, ఉత్తరాలు తన తండ్రి దగ్గరపడితే తను ఆత్మహత్య చేసుకోవల్సిందే! తన తమ్ముడి దగ్గర సిగ్గుపడాల్సిందే! చెల్లెలు దగ్గర చులకన కావాల్సిందే! చుట్టాలు పక్కాల దగ్గర అవ మానంపాలు కావల్సిందే! అవన్నీ అలివేలు ఎలా సేకరించగలిగిందో? అమ్మో అవి ఎవరికంట పడకూడదు. అవి తనతోనే మాసిపోవాలి. అలివేలుని బతిమాలుకోవాలి. తనకి అధికారం అక్కర లేదని క్షమాపణ చెప్పుకోవాలి. అలివేలు చాలా తెలి వైనది. తన జాతకం గుప్పెట్లో ఉంచుకొని, సమయం చూసి బయటపెట్టింది. తన బలహీనత ఆమెకి తెలుసని తనెప్పుడూ ఊహించలేదు. ఇన్నాళ్ళు తను చేసిన కృషి, ఉద్యమం, శ్రమ, అవిశ్వాస తీర్మానం—అన్నీ ఉప్పునీరులో కలిసి పోయినట్లే. ఏ నోటితో ఏ మనుషుల ముందు అలివేలు అధికారం వద్దన్నాడో: ఆ నోటితోనే ఆ మనుషుల ముందే అలివేలు అధికారమే మళ్ళీ మళ్ళీ కావాలని అడగాలి. సత్య వలవల ఏడ్చేశాడు.

'అలివేలు నీకు జోహారు' మనసులో అనుకో బోయిన మాట అతని ప్రమేయం లేకుండగానే బయటికి వచ్చేసింది. అదే సమయంలో అలివేలూ భోంచేసి వచ్చేసింది.

"థాంక్స్"

"అలివేలూ! నువ్వు చెప్పినట్లే చేస్తాను. నా కీ పదవీ, అధికారమూ ఏమీ వద్దు. ఈ ఇంట్లో ఎవరిదగ్గర నా పరువు తీయకు. కావలిస్తే నీ కాళ్ళు పట్టుకుంటాను. నన్ను క్షమించు" ఇందాక వచ్చిన కన్నీళ్ళు తుడుచుకున్నాడు సత్య.

"ఆల్‌రైట్...మొదట ఈ కాగితమ్మీద సంతకం చేయండి" అని ఒక షరతుల జాబితా అందించింది, అలివేలు.

అందులో అతను ఒక అక్షరం కూడా చూడ లేదు. మౌనంగా సంతకం చేసి తిరిగి ఇచ్చేశాడు. తర్వాత—ఆ ఫైలూ, ఉత్తరాలు తీసుకొని భద్రం చేసింది.

"ఇది చదువుకున్నారా?"

"లేదు."

"ఇందులో చాలా షరతులు ఉన్నాయి."

"ఉండొచ్చు."

"ఈ షరతుల ప్రకారం మీరు మొదట ఉద్యమానికి స్వస్తి చెప్పాలి."

"అలాగే"

"ఈ ఇంటి అధికారం మీరు స్వీకరించడం లేదని, అవిశ్వాస తీర్మానాన్ని ఉపసంహరించు కుంటున్నట్టు అందరిముందు ఒప్పుకోవాలి."

"తప్పకుండా."

"ఇటువంటి ఆందోళనలు ముందు ముందు లేవదీయరని హామీ ఇవ్వాలి."

"దేవుడి సాక్షిగా!"

"ప్రస్తుతం మీరు పనిచేస్తున్న ఆఫీసు నుండి మన వూళ్ళోనే ఉన్న మరో బ్రాంచికి ట్రాన్స్‌ఫర్ చేయించుకోవాలి."

"ఇరవై నాలుగ్గంటల్లో."

"మీ పాత ప్రియురాళ్ళను కలుసుకోవడానికి గాని, వాళ్ళకి ఉత్తరాలు రాయటానికిగాని వీల్లేదు."

"చెంపలు వేసుకొని..."

"చిన్న పెళ్ళివారిని కలుసుకొని, మీ చెల్లాయి పెళ్ళి ఖాయం చేయాలి."

"ఈ క్షణంలోనే."

"మళ్ళీ నా అధికారాన్ని బలపర్చాలి."

"హృదయపూర్వకంగా."

"ఆల్‌రైట్...అన్ని షరతులకి మీరు ఒప్పు కున్నట్లేనన్న మాట. అయితే — రేపు గాంధి సెలూన్‌కి వెళ్ళి గ్రాండ్‌గా గడ్డం చేయించుకోండి."

"ఓటమిని ఒప్పుకుంటున్నాను."

సత్య బాధగా గడ్డంమీద చేయివేసి, పిచ్చిగా పీక్కున్నాడు. సమర్పణ రావుకి ఇచ్చిన అర్థ రూపాయి కాకుండా అడపాదడపా అధికారం చేజిక్కు తుందని సంబరపడిపోయి చిల్లర ఖర్చులు దండగ చేసినందుకు మనసులో దుఃఖం పెల్లుబికింది. అయినా మగవాడు గనక ఆపుకున్నాడు.

"అలివేలూ! ఒక్కమాట అడగవచ్చా?" చాలా సేపటికి తేరుకుని అడిగాడు.

'ఏమిటన్నట్టు' అలివేలు చూసింది.

"ఈ ఫోటోలూ, ఉత్తరాలూ నువ్వెలా సేకరించావో తెలుసుకోవచ్చా?"

"వద్దు. అదంతా చెప్తే, మరో ఇంతకథవు తుంది. పాఠకులకు బోరు కొడుతుంది. ఏ క్షణంలో ఏ పని మీరు చేస్తున్నారో తెలుసుకొని చెప్పటానికి నాకు మనుషులున్నారు. నే నీ పదవిలో కాలు పెట్టటానికి అసలు కారణం మీ ప్రవర్తన. ఒకానొక రోజున మీ డైరీలు చదివాక—ఇంట్లో మీరు శ్రీరామచంద్రులని, బయట శ్రీకృష్ణుల వారని తెలుసుకున్నాను. మిమ్మల్ని సంస్కరించడం కోసం, మీ విలాసాలకి చితికిపోతున్న ఈ కుటుం బాన్ని కాపాడ్డంకోసం నేను నడుంకట్టాను."

"హతోస్మి"

సత్య కెవ్వుమన్నాడు.

అదేమీ పట్టించుకోని అలివేలు — తిరిగి సంపాదించుకున్న సింహాసనాన్ని విజయగర్వంతో అధిరోహించే మహారాజ్ఞిలా ముందుకి సాగి పోతుంటే, ఆమె నీడ వెనక్కి పొడుగ్గా సాగుతూ సత్యలోని బాధాలు కనిపించకుండా అతన్ని ఆక్ర మించుకుంటుంది.

*